రైతుల కల నెరవేరేదెప్పుడో..?

- చలివాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల వేడుకోలు
- పట్టించుకోని గత పాలకులు, అధికారులు
- ఆయకట్టు రైతులకు సాగు కష్టాలు
- ఎమ్మెల్యే 'రేవూరి' దృష్టి సారించాలని స్థానికుల విన్నపం


ఉధృతంగా ప్రవహిస్తున్న చలివాగును దాటుతున్న కూలీలు (ఫైల్)

పరకాల: మారుమూల గ్రామం కాదు.. గోదావరి ప్రవాహక తీరం కాదు.. కానీ వర్షాకాలం వచ్చిందంటే చాలు నెల రోజుల పాటు ఆ దారి నుంచి రాకపోకలు కొనసాగాలంటే సాహసం చేయాల్సిందే. వంతెన నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తే తమ కష్టాలు తీరుతాయని వాగు ఆయకట్ట కింద పంటలు సాగు చేస్తున్న రైతుల కల నేటికి నేరవేరలేదు. పరకాల శివారులోని చలివాగు (మొండి వాగు)పై వంతెన నిర్మాణం చేయాలని ఆయకట్ట రైతులు విన్నవించుకున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణం నుంచి దమ్మన్నపేట వెళ్లే దారి మధ్యలో గల చలివాగు (మొండి వాగు) ప్రవాహం ఆయకట్ట రైతులకే కాకుండా పలు గ్రామాల రైతులకు సమస్యగా మారింది. చలివాగు ఆయకట్ట కింద సుమారు 500 ఎకరాలు సాగు భూమి ఉంది. పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు వాగు దాటాల్సిందే. సాధారణ రోజుల్లో వాగు ప్రవాహం పెద్దగా ఉండనప్పటికీ వర్షాకాలంలో మాత్రం ఉధృతంగా ప్రవహిస్తుంది. దింతో చాలా మంది రైతులు వాగు దాటడానికి ఎడ్లబండ్ల ద్వారా వెళ్లాల్సి వస్తుంది. వాగు దాటించేవారు కూడా ఉండకపోవడంతో వాగులో కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. ఏవరైన వాగు దాటే సాహసం చేస్తే ప్రాణాలు మీదకు కొనితెచ్చుకున్నట్లే అవుతుందని ఆయకట్ట రైతులు అంటున్నారు. చలివాగుపై వంతెన నిర్మాణం చేయాలని ఆయకట్ట రైతులు, పరకాల, దమ్మన్నపేట ప్రజలు పలుమార్లు అధికారులకు, గత పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. కనీసం ప్రతిపాదనలు కూడా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.


వినాయకుడిని వాగులో నిమజ్జనం చేస్తున్న పురపాలక సిబ్బంది, భక్తులు (ఫైల్)

వినాయక నిమజ్జనానికి కష్టాలే..

వంతెన నిర్మాణం చేస్తే వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు ఉండేవి కాదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వంతెన లేకపోవడంతో వినాయక నిమజ్జన రథాలు వాగులోకి వెళ్లాల్సి వస్తుందని, అక్కడ నీటిలో ఉన్న పురపాలక సిబ్బంది విగ్రహాలను మోసుకొని నీటిలో వేయాల్సి వస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



వర్షకాలంలో మొండివాగు దాటడం రైతులకు, కూలీలకు ఇబ్బందికరంగా మారింది. వ్యవసాయం చేసుకోవాలంటే తల ప్రాణం తోకకు వస్తుంది. అనేక సార్లు వంతెన నిర్మాణం చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. నూతనంగా గెలిచిన స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి వంతెన నిర్మాణం పనులు చేపట్టాలి.

– బండారి దేవేందర్, పరకాల

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

నడికూడ: వాగు పక్కన ఉంచిన బైక్ చోరీ అయ్యింది. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుని కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి యుగేందర్ తన వ్యక్తగత పనుల నిమిత్తం గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్లేసరికి బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో బైక్‌ను అక్కడే పార్కింగ్ చేసి ఇంటికి వచ్చి పెట్రోల్ తీసుకెళ్లేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పరకాల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. వారం రోజుల వ్యవధిలో మండల కేంద్రంలో రెండో సారి చోరి జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా మండల కేంద్రంలో ఉన్న సీసీ కెమెరాలు సాంకేతిక కారాణాలతో పనిచేయడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరకాల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంచ కృష్ణ కుటుంబాన్ని మంగళవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. నాగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కంచ రవీందర్ చిన్న కుమారుడు పరకాల శివారులో బైక్ అదుపు తప్పి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన మృత దేహానికి ధర్మారెడ్డి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం వివిధ కారణాలతో మృతి చెందిన నాగారం గ్రామానికి చెందిన అర్శనపల్లి సమ్మక్క, అయిలి రవీందర్‌గౌడ్, చిట్టిరెడ్డి కళింగరెడ్డి కుటుంబాలతో పాటు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మార్క భిక్షపతి, పల్లెబోయిన సారమ్మ కుటుంబాలను పరామర్శించారు. వైస్ ఎంపీపీ మదుసూధన్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు పల్లెబోయిన అశోక్, గురిజపల్లి ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ



దామెర: ఎంపీడీఓగా ఎం. వెంకటేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటేషన్‌పై దామెర ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న కాసర్ల రవీందర్ సంగెం మండల ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. కాగా సంగెం ఎంపీడీఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రావు దామెర ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు స్వాగతం పలికారు.

కడియం ఫౌండేషన్ చేయూత



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి గొడెల మనిర్వేశ్‌రెడ్డి హనుమకొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థి పరిస్థితిని చూసిన స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కడియం కావ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె రూ.25000 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నర్సంపేట: పట్టణంలోని పాకాల మహిళా బ్యాంకు పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తొలుత ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, కార్యదర్శి ఇమ్మడి పద్మ, పాలకవర్గ సభ్యులు గొర్రె రాధ, శ్రీదేవి, వనజ. కీసరి విజయ, అకౌంటెంట్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

అభినందన

నెక్కొండ: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి అభినందించారు. తొలుత ఎమ్మెల్యేకు శ్రీకాంత్, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. దొంతి గెలుపుతో నియోజకవర్గం అభివృద్ధి దిశగా సాగనుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు భూక్య శరత్‌నాయక్, నాయకులు తేజావత్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులు ప్రారంభం

నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాలలో చేపట్టిన ఉపాధి హామీ పనులను సర్పంచ్ గొడిశాల మమత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఉపాధి హామీ పనిలో భాగంగా నాగపూరి సారయ్య ఇంటి నుంచి లింగాపురం రోడ్డు వరకు ఫార్మేషన్ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ జానకి పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


షష్ఠిజాతర కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

పరకాల: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన క్షేత్రముగా పేరుపొందిన శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో శ్రీసుబ్రహ్మణ్య కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఈఓ వెంకటయ్య, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సఖి కేంద్రాలతో మహిళలకు రక్షణ


ల్యాబర్తిలో మాట్లాడుతున్న నిర్మలాదేవి

వర్ధన్నపేట: సఖి కేంద్రాలతో మహిళలకు రక్షణ లభిస్తుందని కౌన్సెలర్ నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని ల్యాబర్తి, దమ్మన్నపేట గ్రామాల్లో వీఓ గ్రూపు సభ్యులకు సఖి కేంద్రం సేవలు, మహిళల రక్షణ చట్టాలపై మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటైన నిర్భయ, గృహ హింస నిరోధక, తదితర చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళలు, బాలికలు అనేక హింసలకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. వేధింపులు ఎదుర్కొనే మహిళలకు రక్షణ కల్పించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాయని చెప్పారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, బాలికలు హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందుతుందన్నారు. బాధితులు సఖి కేంద్రాల సేవలను విని యోగించుకోవాలని కోరారు. సమావేశంలో వీఓఏలు స్వరూప, వనిత పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న మార్క్ లూయిస్ హార్న్

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ప్రాబ్లమ్ సాల్వింగ్ అండ్ ఇంటర్‌పర్సనల్ రిలేషన్‌షిప్ స్కిల్స్' అంశంపై మార్క్ లూయిస్ హార్న్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, టాస్క్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మనీశ్, విభాగాధిపతులు రవి, నాగరాజు పాల్గొన్నారు.

అంధుల సమస్యలు పరిష్కరించండి

నయీంనగర్ : బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసి అంధుల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ అంధుల నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు ఎస్.మహేందర్, ప్రధాన కార్యదర్శి జి.వీరన్న ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంధులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు.

కక్ష సాధింపు చర్యలు ఉండవు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు


హన్మకొండ: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హన్మకొండ: తాను ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి, నిర్బంధాలు కొనసాగించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అలాంటివి ఉండవన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నట్లు కనీస జ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామ అభివృద్ధి కమిటీల ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. బ్రోకర్లకు తావు లేదన్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వెనుక అనేక ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జలగం అనిత, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కేయూలోని సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని కేయూ ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ బాధ్యులు మంగళవారం హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి విన్నవించారు. ఇటీవలనే ఎమ్మెల్యేగా ఎన్నికైన నాగరాజును అసోసియేషన్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేయూ ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు వరలక్ష్మి, సమ్మయ్య, కరుణాకర్, సదాశివ, అజయ్, జగన్, రవీందర్, సంపత్, సురేష్, చందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మంగళవారం హనుమకొండ సుబేదారిలోని తన నివాసంలో మడికొండకు చెందిన బుర్ర శ్రీధర్, కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్, శంకర్, నాగరాజు, గోపి, నవీన్ యాదవ్, చంద్రమౌళి, రాజేందర్, రాజ్‌కుమార్, మానుపాటి రాజు, స్థానిక నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. గత ప్రభుత్వం గ్రామంలో అభివృద్ధి పనులను విస్మరించిదని, మన ప్రభుత్వంలో పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సురేందర్

హన్మకొండ: మహాజన సోషలిస్టు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బండారి సురేందర్ మాదిగను నియమించారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన మంద కృష్ణమాదిగకు, నాయకులు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బొడ్డు రాకేష్ తండ్రి భిక్షపతి సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం రాకేష్ నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పంచాయతీ ట్రాక్టర్‌తో ప్రైవేట్ పనులు

- సర్పంచ్ కుమారుడి తీరుపై విమర్శలు

సంగెం: మండలంలోని బీకోజీనాయక్ తండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో ప్రైవేట్ పనులు చేస్తుండడంతో సర్పంచ్ బానోత్ విద్యారాణి కుమారుడు వంశీ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంశీ గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను సొంత పనులకు వాడుకోవడంతోపాటు వ్యాపారం సైతం చేస్తున్నట్లు తండావాసులు వ్యాఖ్యానిస్తున్నారు. వాటర్ ట్యాంకర్‌ను ఇతర అవసరాలకు వాడుకుంటు వచ్చిన డబ్బులు గ్రామ పంచాయతీకి జమ చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. అంతే కాకుండా మంగళవారం తండాలోని ఓ రైతుకు చెందిన పత్తిని మార్కెట్‌కు తరలించడం వివాదాస్పదంగా మారింది. కొత్తగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం చేపట్టిన దగ్గర నుంచి సిమెంట్, మెటిరియల్ తరలింపు, ఇతర పనులు జీపీ ట్రాక్టర్‌తో నిర్వహిస్తుండడంతో తండావాసులు మండిపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి స్వప్నను 'సాక్షి' వివరణ కోరగా తనకు తెలియకుండానే జీపీ ట్రాక్టర్‌లో ప్రైవేట్ వ్యక్తికి చెందిన పత్తిని మార్కెట్‌కు తరలించారని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని రిటైర్డ్ నాన్‌టీచింగ్ ఉద్యోగ సంఘం బాధ్యులు మంగళవారం వీసీ రమేష్‌ను మంగళవారం మర్యాదదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పీఆర్‌సీకి సంబంధించిన ఇన్‌స్టాల్‌మెంట్స్ చెల్లించాలని, డీఏ ఏరియర్స్‌ను ఇవ్వాలని, గ్రాట్యూటీ డిఫరెన్స్ అమౌంట్ కొందరి ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటిని వెంటనే చెల్లించాలని వీసీకి విన్నవించారు. అలాగే ఈనెల 20వ తేదీన కేయూలోని కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌లో నాన్‌టీచింగ్ ఉద్యోగుల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వీసీని కలిసిన వారిలో ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎస్.సంజీవరావు, డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు, బాధ్యులు జి చంద్రమౌళి, ఎస్‌ఎస్‌ఆర్ మూర్తి, లక్ష్మారెడ్డి, ఎండీ.అమీన్, నరసింహామూర్తి, అక్తర్ ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు కలిసిన సమయంలో అక్కడే రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య తదితరులు ఉన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి


యువకులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర: యువత సన్మార్గంలో పయనించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్సై కొంక అశోక్ సూచించారు. మండలంలోని ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో మంగళవారం యువకులకు మంచి నడవడికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం, గుట్కా, జూదం వంటి వ్యసనాల భారిన పడకుండా చదువుపై దృష్టి సారించాలని అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని పేర్కొన్నారు. అనవసరమైన గొడవల్లో తలదూర్చి కేసులపాలుకాద్దని అన్నారు. కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సైలు రాజు, సిద్ధయ్య, గ్రామస్తులు, సిబ్బంది, యువలకు తదితరులు పాల్గొన్నారు.

'ఫిజియో' సేవలు ఉచితంగా పొందాలి


ఫిజియో సేవలు అందిస్తున్న వైద్యురాలు, సీఎంఓ

ఐనవోలు: ఫిజియోథెరపీ అవసరం ఉన్న విద్యార్థులు మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో ఉన్న ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ సెంటర్‌లో ప్రతి మంగళవారం ఉచితంగా పొందాలని కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి(సీఎంఓ) రాధ కోరారు. ఉదయం 9 గంటలకు ఫిజియోథెరపీ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో మంగళవారం ఫిజియోథెరపీ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఫిజియో సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, బీమళ్ల సారయ్య, సునీత, ఫిజియోథెరపీ డాక్టర్ ఆర్ మమత, ఐఈఆర్‌పీ భవన్‌కుమార్, వసంత, సీఆర్‌పీ రేవతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సంతకం చెయ్యా..


మాట్లాడుతున్న ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్

వేలేరు : గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే వరకూ సిబ్బందికి ఇచ్చే వేతనాల చెక్కులపై సంతకం చేసేది లేదని వేలేరు ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. మంగళవారం వేలేరు గ్రామపంచాయతీ సిబ్బందికి చెల్లించాల్సిన వేతనాలకు సంబంధిచిన చెక్కులను సర్పంచ్ మాధవరెడ్డి సతకం చేసి ఉపసర్పంచ్ వద్దకు పంపించారు. అయితే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేంత వరకు చెక్కులపై సంతకం చేయనని ఆన సిబ్బందిని వెనక్కి పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో వీధి కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని వీధుల్లో నల్లా నీళ్లు రావడం లేదని, వీధి దీపాలు లేవని, డ్రెయినేజీలు శుభ్రపరచకపోవడంతో వీధుల్లో దుర్వాసన వస్తుందని, గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నా పట్టించుకోవడం లేదని అన్నారు. సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేస్తే పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించే వరకు చెక్కులపై సంతకం చేసేది లేదని తెల్చి చెప్పారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ప్రశంస పత్రం అందించి విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేలేరు : 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని స్రవంతి ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కే.స్రవంతి తెలిపారు. ఈ మేరకు ప్రశంసపత్రం అందించి అభినందించారు. ఈనెల 14వ తేదీన కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దస్రూ నాయక్, కన్వీనర్ రాజేందర్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపికల్లో అండర్ –17 బాలికల విభాగంలో స్రవంతి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపికైన స్రవంతిని పీఈటీ కిరణ్మయి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్


ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థినులు


ఓటు వేస్తున్న విద్యార్థి

ధర్మసాగర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఎన్నికలు జరిగే విధానంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాష్ అధ్యక్షతన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు స్వర్ణలత ఆధ్వర్యంలో నామినేషన్ వేయడం మొదలు, ఉపసంహరణ, బ్యాలెట్ పత్రం ద్వారా ఓటు వేయడం, వివిధ రకాల ఫ్రాఫార్మ్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చివరగా ఓట్ల లెక్కింపును విద్యార్థులే స్వయంగా నిర్వహించేలా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో క్యూలో నిల్చొని తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నారు. ఈ మాదిరి ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులు రిత్విక, అక్షయ్‌లకు హెచ్‌ఎం ధర్మప్రకాష్ పత్రాలను అందచేశారు. ఎన్నికల పరిశీలకులుగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సురేష్ వ్యవహరించగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

నయీంనగర్ : పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కుడా కార్యాలయ మీటింగ్ హాల్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కుడా, మున్సిపల్, స్మార్ట్ సిటీ అభివృద్ధి పథకాలపై మున్సిపల్, కుడా, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే నాయిని సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న, చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్షించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, కుడా సెక్రటరీ మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.